రైజర్స్ అదుర్స్

ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ మూడో అత్యధిక స్కోరు

కేకేఆర్‌పై ఘన విజయం | క్లాసెన్ మెరుపు శతకం.. | హైదరాబాద్ 278/3

ఢిల్లీ: భారీ అంచనాలతో ఐపీఎల్-18 బరిలోకి దిగి ఆశించిన స్థాయిలో రాణించలేక ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్).. రికార్డు స్కోర్లు చేయడంలో మాత్రం తమకు తామే సాటి అని మరోసారి నిరూపించుకుంది. ఆదివారం ఢిల్లీలో డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. 20 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ లీగ్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు. హెన్రిచ్ క్లాసెన్ (39 బంతుల్లో 105 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్సర్లు) మెరుపు శతకానికి తోడు ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 76, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా.. 18.4 ఓవర్లలో 168 రన్స్‌కు ఆలౌటై 110 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మనీష్ ఫాండె (37), హర్షిత్ రానా (34*), సునీల్ నరైన్ (31) కేకేఆర్ ఓటమి అంతరాన్ని తగ్గించారు. ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లలో ఉనద్కత్ (3/24), హర్ష్ దూబె (3/34) రాణించారు.

బాదుడు మంత్రం

నోకియా రెండో ఓవర్లో సిక్సర్‌తో హెడ్.. దంచుడుకు ముహూర్తం పెట్టగా అదే ఓవర్లో అభిషేక్ శర్మ (16 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండు బౌండరీలు కొట్టాడు. ఆ తర్వాత హెడ్.. వైభవ్, హర్షిత్ లక్ష్యంగా చేసుకుని వీరబాదుడు బాదడంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు 79/0గా నిలిచింది. 'ట్రావిషేక్' జోడీ 7 ఓవర్లకే 92 పరుగులతో అదిరిపోయే ఆరంభాన్నిచ్చింది. నరైన్ ఏడో ఓవర్లో అభిషేక్ ఔట్ అయినా మూడో స్థానంలో క్లాసెన్ రాకతో కోల్‌కతా బౌలర్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టైంది. వరుణ్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదడంతో హెడ్ అర్ధ శతకం పూర్తయింది. మరో ఎండ్‌లో క్లాసెన్ వచ్చీ రాగానే కేకేఆర్ బౌలర్లపై పిడుగులా విరుచుకుపడటంతో హైదరాబాద్ 10 ఓవర్లకే 139/1 స్కోరు చేసింది. హర్షిత్ 11వ ఓవర్లో క్లాసెన్.. 4, 6, 6తో 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఎట్టకేలకు నరైన్ 13వ ఓవర్లో హెడ్‌ను ఔట్ చేయడంతో హైదరాబాద్ రెండో వికెట్ కోల్పోయింది. క్లాసెన్‌తో కలిసి హెడ్ రెండో వికెట్‌కు 35 బంతుల్లోనే 83 రన్స్ జోడించాడు. హెడ్ నిష్క్రమించినా క్లాసెన్ దూకుడు తగ్గలేదు. ఇషాన్ కిషన్ (29) అండగా అతడు మరింత రెచ్చిపోయి ఆడటంతో 15 ఓవర్లకే సన్‌రైజర్స్ 200 దాటింది. రసెల్ ఓవర్లో 4, 6, 4తో 90లలోకి వచ్చిన క్లాసెన్.. వైభవ్ 19వ ఓవర్లో వేసిన ఆఖరి బంతిని మిడ్ వికెట్ దిశగా తరలించి తన కెరీర్‌లో రెండో ఐపీఎల్ శతకాన్ని నమోదుచేశాడు. ఇషాన్‌తో మూడో వికెట్‌కు క్లాసెన్.. 36 బంతుల్లో 83 రన్స్ జతచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 278/3 (క్లాసెన్ 105*, హెడ్ 76, నరైన్ 2/42, వైభవ్ 1/39) **కోల్‌కతా:** 18.4 ఓవర్లలో 168 ఆలౌట్ (మనీష్ 37, హర్షిత్ 34*, ఉనద్కత్ 3/24, హర్ష్ 3/34)

ఐపీఎల్‌లో అత్యధిక స్కోర్లు

ఎస్‌ఆర్‌హెచ్	287/3	X బెంగళూరు, 2024
ఎస్‌ఆర్‌హెచ్	286/6	X రాజస్థాన్, 2025
ఎస్‌ఆర్‌హెచ్	278/3	X కోల్‌కతా, 2025
ఎస్‌ఆర్‌హెచ్	277/3	X ముంబై, 2024

రన్నరప్‌తో సరి

ఫైనల్‌లో తడబడ్డ శ్రీకాంత్ • మలేషియా మాస్టర్స్

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్‌లో సంచలన విజయాలతో ఫైనల్ చేరిన భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం రన్నరప్‌తో ముగిసింది. బీడబ్ల్యూఎఫ్ నిర్వహించే టోర్నీలలో ఆరేండ్ల తర్వాత ఫైనల్‌కు అర్హత సాధించిన అతడు.. కీలక పోరులో తడబాటుకు గురయ్యాడు. క్వాలిఫయర్ దశ నుంచి మొదలుకుని సెమీస్ దాకా తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన షట్లర్లకు షాకిచ్చిన ఈ ప్రపంచ మాజీ నెంబర్ వన్.. ఫైనల్‌లో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చేయలేక చతికిలపడ్డాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో శ్రీకాంత్.. 11-21, 9-21తో చైనా షట్లర్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ లి షెంగ్ ఫెంగ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. వరుస గేమ్‌లలో చిత్తైన శ్రీకాంత్.. ఆరంభం నుంచే తడబడి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. 36 నిమిషాల్లోనే ఆటను ముగించిన లి షెంగ్.. మ్యాచ్ ఆసాంతం శ్రీకాంత్ చేసిన అనవసర తప్పిదాలను అందిపుచ్చుకుని వాటిని అతడికి అనుకూలంగా మలుచుకున్నాడు. తొలి గేమ్ ఆరంభంలోనే 14-8తో లి ఆధిక్యంలోకి దూసుకెళ్లగా శ్రీకాంత్ కాస్త పుంజుకోవడంతో దానిని 10-16కు తగ్గించాడు. కానీ లి మాత్రం దూకుడును కొనసాగిస్తూ ఆ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్ ఏకపక్షంగానే సాగడంతో శ్రీకాంత్‌కు నిరాశ తప్పలేదు. ఫైనల్‌లో ఓడినా తన ఆట పట్ల సంతృప్తిగా ఉన్నానని, తుదిపోరులో తనకు ఆశించిన ఫలితం రాకపోయినా టోర్నీ ఆసాంతం మంచి ప్రదర్శన చేశానని మ్యాచ్ అనంతరం శ్రీకాంత్ తెలిపాడు.

క్వార్టర్స్‌కు పవన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ పవన్ బర్త్వాల్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 55 కిలోల విభాగంలో పవన్.. 5-0తో సవొరంగ్సె (కంబోడియా)ను మట్టి కరిపించాడు. బౌట్‌లో సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన బర్త్వాల్.. పదే పదే ప్రత్యర్థిని బౌట్ కార్నర్ వద్దకు తీసుకెళ్లి పాయింట్లు రాబట్టాడు. అటాకింగ్‌తో పాటు డిఫెన్స్‌లోనూ అతడు కంబోడియా బాక్సర్‌కు పాయింట్లు సాధించే అవకాశమివ్వలేదు.

ఒకవైపు ఐపీఎల్‌తో బిజీబిజీగా గడుపుతున్న స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వీలు చిక్కినప్పుడల్లా ఆధ్యాత్మిక సేవలో సేదతీరుతున్నాడు. ఇటీవలే సతీసమేతంగా ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమానికి వెళ్లిన కోహ్లీ.. ఆదివారం అనుష్కతో కలిసి అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి ఆలయాన్ని సందర్శించాడు.

విజయంతో ముగించారు

తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ విక్టరీ

గుజరాత్ టైటాన్స్‌పై 83 పరుగులతో గెలుపు • మెరిసిన బ్రెవిస్, నూర్

అహ్మదాబాద్: ఐపీఎల్-18 సీజన్ ఆసాంతం ఒడిదొడుకులతో సాగిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రయాణం విజయంతో ముగిసింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో చెన్నై.. టేబుల్ టాపర్స్ గుజరాత్ టైటాన్స్‌కు షాకిస్తూ ఆ జట్టుపై 83 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. డబుల్ హెడర్‌లో భాగంగా ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' డెవాల్డ్ బ్రెవిస్ (23 బంతుల్లో 57; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (35 బంతుల్లో 52; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉర్విల్ పటేల్ (19 బంతుల్లో 37; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుష్ మాత్రె (17 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించడంతో ఈ సీజన్‌లో సీఎస్‌కే తొలిసారి 200 పరుగుల మార్కును దాటింది. భారీ ఛేదనలో గుజరాత్.. 18.3 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది. సాయి సుదర్శన్ (28 బంతుల్లో 41; 6 ఫోర్లు) టాప్ స్కోరర్. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ (3/13), నూర్ అహ్మద్ (3/21), రవీంద్ర జడేజా (2/17) టైటాన్స్‌ను దెబ్బకొట్టారు.

సమిష్టి విజయం

అర్షద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే ఆయుష్.. 6, 6, 4, 4, 6తో 28 పరుగులు పిండుకుని చెన్నైని టాప్ గేర్‌లోకి తెచ్చాడు. ఆ తర్వాత కాన్వే, ఉర్విల్.. స్కోరు వేగం తగ్గకుండా ధాటిగా ఆడటంతో 9 ఓవర్లకే చెన్నై 100 పరుగుల మార్కును అందుకుంది. ఈ ఇద్దరూ నిష్క్రమించినా ఆఖర్లో జడేజా (21)తో కలిసి బ్రెవిస్.. టైటాన్స్ బౌలర్లపై సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఛేదనలో మూడో ఓవర్లోనే సారథి గిల్ (13) వికెట్ కోల్పోయిన టైటాన్స్.. తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. బట్లర్ (5), రూథర్‌ఫర్డ్ (0), షారుక్ (13), తెవాటియా (14) విఫలమయ్యారు. ఆరంభంలో జడేజా, అన్షుల్ గుజరాత్‌ను దెబ్బతీస్తే నూర్ లోయరార్డర్ పనిపట్టాడు. కాగా ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లాడి నాలుగింట్లో మాత్రమే గెలిచిన చెన్నై.. 8 పాయింట్లతో పదో స్థానంలో నిలిచింది. ఒక ఐపీఎల్ సీజన్‌లో పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలవడం చెన్నైకి ఇదే తొలిసారి కావడం గమనార్హం.

పాయింట్ల పట్టిక

జ		మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	✓	14	9	5	0	18	0.60
పంజాబ్	✓	13	8	4	1	17	0.32
బెంగళూరు	✓	13	8	4	1	17	0.25
ముంబై	✓	13	8	5	0	16	1.29
ఢిల్లీ	X	14	7	6	1	15	0.01
హైదరాబాద్	X	14	6	7	1	13	-0.24
లక్నో	X	13	6	7	0	12	-0.33
కోల్‌కతా	X	14	5	7	2	12	-0.25
రాజస్థాన్	X	14	4	10	0	8	-0.54
చెన్నై	X	14	4	10	0	8	-1.03

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ఆర్‌సీబీకి కొత్త జోష్

జట్టుతో కలిసిన హాజిల్‌వుడ్

లక్నో: ప్లేఆఫ్స్‌కు ముందు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అభిమానులకు అదిరిపోయే శుభవార్త. ఆ జట్టు స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ లక్నోలో జట్టుతో కలిశాడు. భారత్-పాక్ దేశాల ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వారం రోజులు వాయిదా పడటంతో ఆస్ట్రేలియాకు వెళ్లిపోయిన ఈ ఆసీస్ పేసర్ తిరిగి రావడం కష్టమేనని అనుకున్నా.. ఎట్టకేలకు అతడు జట్టుతో కలవడంతో బెంగళూరు బౌలింగ్ విభాగం పటిష్టమైంది.

భారత్ ఖాతాలో మరో రజతం, కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్

ఢిల్లీ: జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత యువ షూటర్లు అదరగొడుతున్నారు. ఆదివారం జరిగిన పది మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం, కాంస్యం దక్కించుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నరేన్ ప్రణవ్-ఖాయతి చౌదరి ద్వయం.. 631 పాయింట్లు స్కోరు చేసి తృటిలో పసిడి పతకాన్ని కోల్పోయినా రజతంతో సరిపెట్టుకుంది. చైనా జోడీ యుటింగ్-లివాన్లిన్.. 632.6 స్కోరుతో స్వర్ణం గెలుచుకుంది. 14వ షాట్ వరకూ భారత్,చైనా సమాన పాయింట్లతో సాగినా 15వ షాట్‌కు చైనా షూటర్లు.. 0.5 పాయింట్లు ఎక్కువ స్కోరు చేసి పసిడి కైవసం చేసుకున్నారు. ఇక కాంస్య పోరులో హిమాన్ష-శాంభవి జంట.. 629.5 పాయింట్లు స్కోరుతో అమెరికన్ జోడీ గ్రిఫిన్-స్పెన్సర్‌ను ఓడించి కాంస్యం దక్కించుకుంది.

రూ.3వేలతో అన్‌లిమిటెడ్ జర్నీ!

నూతన ఫాస్టాగ్ పాలసీకి కేంద్రం కసరత్తు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): నేషనల్ హైవేలపై ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. అన్ని రహదారులపై ప్రతిసారీ టోల్‌ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేకుండా ఒకేసారి ఏడాదికి చెల్లించేలా తగు విధానాలు రూపొందిస్తున్నట్టు సమాచారం. ఎలాంటి అంతరాయంలేని ప్రయాణాన్ని అందించడానికే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఇప్పటికే ముసాయిదా రూపొందించినట్టు అధికారులు తెలిపారు. ఈ ముసాయిదా ప్రతిపాదనలో వాహనదారులు రూ.3వేలు చెల్లించి ఏడాదంతా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై అపరిమితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నది. వాహనదారులకు ఈ వార్షిక పాస్‌తో దేశవ్యాప్తంగా ప్రయాణం చేసేందుకు అవకాశం ఇవ్వనున్నది. ప్రస్తుతం రూ.3వేలు వార్షిక ప్లాన్ మాత్రమే కాకుండా, 100 కిలోమీటర్ల దూరానికి రూ.50 చెల్లిస్తే సరిపోయేలా మరో ప్లాన్ సైతం తీసుకరానున్నది.

గురుకులాల నిర్వహణ జోనల్ ఆఫీసర్లదే

ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలి: వర్షిణి

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): గురుకుల భవనాల నిర్వహణ, ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్, కార్పెంటరీ తదితర మరమ్మతుల బాధ్యత జోనల్ ఆఫీసర్లదేనని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) సెక్రటరీ అలుగు వర్షిణి వెల్లడించారు. సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేశారు. జోనల్ ఆఫీసర్లకే ప్లంబింగ్ కమ్ ఎలక్ట్రిషియన్లను(పీసీఈ) అటాచ్ చేశారు. ఒక్కో పీసీఈకి 2, 3 గురుకుల బాధ్యతలు అప్పగించారు. 268 గురుకులాలకు 93మంది పీసీఈలను కేటాయించారు. ప్రతి నెలా పీసీఈ రిపోర్టును అందించాలని ఆదేశించారు.

బడికి పంపేటప్పుడే మొక్కలు నాటాలి

- పిల్లలతోపాటు నాటిన మొక్కలూ పెరుగుతాయి
- అవి వృక్షాలై భవిష్యత్తు తరాలకు మేలు చేస్తాయి
- గ్రీన్ ఇండియా ఉద్యమానికి అండగా ఉంటాం
- ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

హైదరాబాద్, మే 25 (నమస్తేతెలంగాణ): తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించే సమయంలో తప్పనిసరిగా మొక్కలు నాటాలని ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు ఆర్పీ పట్నాయక్ పిలుపునిచ్చారు. వారి పిల్లలతోపాటు నాటిన ఆ మొక్కలు కూడా పెరిగి వృక్షాలుగా మారుతాయని చెప్పారు. ఆ వృక్షాలు భవిష్యత్తు తరాలకు మేలు చేస్తాయని వివరించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా హరితసేన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఓ పార్క్‌లో పట్నాయక్ మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా సంతోష్‌కుమార్ ఎనిమిదేండ్లుగా విరివిగా మొక్కలు నాటిస్తూ, పర్యావరణానికి దోహదపడుతున్నారని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ ఇండియా ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారని, సంతోష్‌కుమార్ చేపట్టిన ఈ ఉద్యమానికి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ సేవన్ హిల్స్ సతీశ్, సింగర్ సత్యయామిని, నా బెస్ట్ ఫ్రెండ్ రాందన్‌ను మొక్కలు నాటలని ఆర్పీ పట్నాయక్ నామినేట్ చేస్తూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరితసేన కో-ఆర్డినేటర్ భోజనారాయణ తదితరు పాల్గొన్నారు.

చురుకుగా విస్తరిస్తున్న నైరుతి

- లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, తమిళనాడులో విస్తరణ
- రెండ్రోజుల్లో గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోకి
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- రాష్ట్రంలో వారంపాటు మోస్తరు నుంచి భారీ వానలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణ శాఖ

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ప్రస్తుతం రుతుపవనాలు లక్షద్వీప్, కేరళ రాష్ట్రంలో పూర్తిగా.. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. వచ్చే రెండ్రోజుల్లో మధ్య అరేబియన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ కొంకణ్ తీరంలో రత్నగిరి, దాపోలి మధ్యలో వాయుగుండం తీరం దాటే అవకాశమున్నట్టు పేర్కొన్నది. ఈనెల 27న పశ్చిమ మధ్య, సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్టు వివరించింది. దీంతో రెండ్రోజులపాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసినట్టు పేర్కొన్నది. సోమ, మంగళ వారాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురవడంతోపాటు, పలు ప్రాంతాల్లో పిడుగులు పడేఅవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు అరేబియా సముద్రంలోని వాయుగుండం, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం ప్రభావంతో ఏపీలో మూడ్రోజులు భారీ వర్షాలతో పాటు, సముద్ర తీరం వెంబడి గంటకు 40-50కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో అత్యధికంగా 12.52సెం.మీ వర్షపాతం నమోదైంది.

ఆ 20 మంది ఎక్కడ?

సమీర్ ఇంట్లో సమావేశమైన కుర్రాళ్లెవరు?

- శిక్షణ పొందిన వారంతా ఉగ్రవాదులేనా?
- వరంగల్ ఫర్హాన్, యూపీ బాదర్ ఎక్కడ?
- రాష్ట్ర ఇంటెలిజెన్స్‌ను తొలిచేస్తున్న ప్రశ్నలు
- ఉగ్ర కుట్రలో వీరంతా భాగస్వాములేనా?
- ఉగ్ర కుట్రలపై నిఘా పెట్టలేని ఇంటెలిజెన్స్!
- ఆ స్లీపర్‌సెల్స్ గుట్టు కనిపెట్టేందుకు తంటాలు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 20 మందికి పైగా మానవబాంబులుగా తయారయ్యేందుకు సిరాజ్, సమీర్ శిక్షణ ఇచ్చినట్టు తెలిసింది. విజయనగరం ఉగ్ర కుట్రకేసులో కీలకంగా ఉన్న సిరాజ్, సమీర్ ఈ విషయాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణలో తెలిపినట్టు సమాచారం. ఇప్పుడు ఆ 20 మంది ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? వారు నిజంగా మానవబాంబులేనా? అన్న నిగూఢమైన విషయాలను పోలీసులు, దర్యాప్తు సంస్థలు తేల్చాల్సి ఉన్నది. ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన పలువురు స్లీపర్ సెల్స్ వీరితో జత కలిసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సికింద్రాబాద్ బోయగూడలోని రైల్ కళారంగ్ బస్తీకి చెందిన సయ్యద్ సమీర్‌కు ఉగ్ర లింకులు ఉంటడమే ఇందుకు కారణం. ఒకవైపు లిప్టు మెకానిక్‌గా పనిచేస్తున్న సమీర్.. కొందరు యువకులతో నిత్యం సమావేశమైనట్టు స్థానికులు చెప్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన పలువురు యువకులతో తన ఇంట్లోనే నిత్యం సమావేశాలు నిర్వహించేవాడని బస్తీవాసులు అంటున్నారు. దీంతో వారంతా ఎవరు? సిరాజ్, సమీర్ చెప్పిన ఆ 20 మంది మానవబాంబులు వాళ్లేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సిరాజ్ చెప్పినట్టు వారే మానవబాంబులైతే.. తెలంగాణలో హైఅలర్ట్ ప్రకటించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు రద్దు చేశారనే వాదనా వినిపిస్తున్నది.

హైదరాబాద్‌లోనే పేలుళ్లకు కుట్రలు?

సిరాజ్ రెహ్మాన్, సయ్యద్ సమీర్ ఢిల్లీ, బెంగళూరు, ముంబై, విజయనగరం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో బాంబు పేలుళ్ల కోసం ఇప్పటికే ప్రాంతాలను ఎంచుకున్నట్టు శనివారం నాటి విచారణలో తేలింది. వారి ప్రధాన లక్ష్యం హైదరాబాద్ గానే ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ కేంద్రంగానే వీళ్లు బాంబులు తయారు చేయడం, వాటి సామగ్రిని హైదరాబాద్ నుంచే ఆర్డర్ పెట్టడం వంటివి అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ కేసులో సమీర్ వాంగ్మూలం కీలకం కానున్నట్టు దర్యాప్తు సంస్థ అధికారులు భావిస్తున్నారు. సమీర్ ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్ ద్వారా ఇటు నిందితులకు, సౌదీ నుంచి ఆపరేట్ చేస్తున్న హ్యాండ్లర్లకు టచ్‌లో ఉన్నాడు. హైదరాబాద్ కేంద్రంగా పలువురికి సహాయం అందించడం, వారికి షెల్టర్ ఇవ్వడం, బాంబుల తయారీలో సిరాజ్‌కు సహకరించడం వంటి కీలక పనులను సమీర్ చేశాడు. దీంతో సమీర్ ఇంకా ఎవరెవరితో కాంటాక్ట్‌లో ఉన్నాడు? ఎవరెవరిని కలిసేవాడు? అనే విషయాలపై తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు కూపీ లాగుతున్నారు.

ఫర్హాన్, బాదర్ ఎక్కడ?

మొదటి నుంచి వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొయినుద్దీన్, యూపీకి చెందిన బాదర్ ఎక్కడ? అనే కోణంలో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఉగ్ర కుట్రల కేసులో సిరాజ్, సమీర్ అరెస్టు అయ్యారని తెలుసుకొన్న వీరిద్దరూ పరారీలో ఉన్నారు. వీరిద్దరూ దొరికితే కానీ, విదేశీ లింకులు కూడా బయటపడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. ఇప్పటికే సిరాజ్, సమీర్‌తోపాటు బాదర్, ఫర్హాన్ కుటుంబసభ్యులు, వారి బంధు, మిత్రుల కదలికలపై నిఘా పెట్టారు. టిఫిన్ బాక్సులతో బాంబుల తయారీ గురించి యూట్యూబ్‌లో వారు నేర్చుకున్నట్టు ఇప్పటికే గుర్తించారు. డమ్మీ బ్లాస్టల తర్వాత.. నేరుగా అసలు పేలుళ్లకు ప్రణాళికలు రచించినట్టు తెలిసింది. 'ఇంకో నాలుగు రోజులు ఆగి ఉంటే.. నా సత్తా తెలిసేది' అని కామెంట్ చేసిన సిరాజ్.. పోలీసులకు దొరకకపోయి ఉంటే ఎక్కడ పేలుళ్లకు పాల్పడేవాడో ఊహించుకుంటేనే మతిపోతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి చెప్పడం గమనార్హం. దీంతో అంతర్జాతీయ స్థాయిలో నిందితుల బ్యాంకు అకౌంట్లు, సోషల్ మీడియా ఖాతాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు.

దాడులను తిప్పికొట్టేందుకేనా?

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఓ వర్గానికి చెందిన వారిపై వరసగా దాడులు జరుగుతున్నాయని, ఆ దాడులను తిప్పికొట్టేందుకే సిరాజ్, సమీర్ మానవబాంబులుగా మారాలని సిద్ధపడినట్టు దర్యాప్తులో తెలిసింది. అవసరమైతే బాంబులతో ప్రతిదాడులకు దిగాలనే ప్రణాళికలు వేసినట్టు దర్యాప్తులో తెలిసింది. ఈ క్రమంలో మైనార్టీ వర్గానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రముఖులు మాట్లాడితే.. వారికి కౌంటర్‌గా కామెంట్లు పెట్టడంలో చురుగ్గా ఉండే వారిని ఎంపిక చేసుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రసంగం వీడియో కింద హిందువులకు వ్యతిరేకంగా సిరాజ్ కామెంట్లు పెట్టినట్టు విచారణలో ఒప్పుకున్నాడు. ఇంత జ